## క్లుప్తంగా

### ఆరిలోవలో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



13వ వార్డులో శిక్షణ శిబిరంలో విద్యార్థులు, జీవీఎంసీ సిబ్బంది

**ఆరిలోవ:** జీవీఎంసీ వేసవి క్రీడా శిక్షణ శిబిరాలకు ఆరిలోవలో మంగళవారం శ్రీకారం చుట్టారు. వీటికి కొందరు జీవీఎంసీ అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించారు. 9, 10, 11, 12, 13 వార్డుల్లో ఈ శిబిరాలను ప్రారంభించారు. వాలీబాల్, కిక్ బాక్సింగ్, కరాటే తదితర క్రీడల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ అనంతరం పిల్లలకు ఉడకబెట్టిన గుడ్లు, పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. మంగళవారం 13వ వార్డులో ప్రారంభించిన శిబిరంలో వార్డు స్పెషల్ ఆఫీసర్ జీవీఎంసీ వర్క్స్ ఏఈ అప్పాజీ, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, సచివాలయాల సిబ్బంది, క్రీడల నిర్వాహకులు పాల్గొన్నారు.

### తీరంలో స్వచ్ఛభారత్



సేకరించిన చెత్తతో నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు, సిబ్బంది

**బీచ్ రోడ్డు:** యాంత్రిక జీవితం పేరిట నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. మంగళవారం సాగరతీరంలో ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ఈ ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనను ఆంధ్ర మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ బుచ్చిరాజు ప్రారంభించారు. అనంతరం బీచ్‌లో స్వచ్ఛ భారత్ చేపట్టారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి జి.మహేశ్వరరావు, అటవీ శాఖ రేంజ్ అధికారి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### జాలరిపేటలో 'సాగర ఘోష'

**ఎంవీపీ కాలనీ:** బీజేపీ జిల్లా నాయకత్వం ఆధ్వర్యంలో మంగళవారం 19వ వార్డు పెద జాలరిపేటలో సాగర ఘోష కార్యక్రమం నిర్వహించారు. సముద్రంలో కలుషిత జలాలు, గెడ్డల మురుగునీరు నేరుగా కలవకుండా చేసే ప్రయత్నంలో భాగంగా ఈ కార్యక్రమానికి బీజేపీ శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, తదితరులు కలుషిత జలాలు, తీర ప్రాంత వ్యర్థాల వల్ల స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పెదజాలరిపేట వెనక గెడ్డలో నుంచి మురుగునీరు సముద్రంలో కలస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సముద్రంలో వ్యర్థజలాలు నేరుగా కలవకుండా రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

**దాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

**25న సహస్ర తులసిపూజ**

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 25న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

# సప్తవర్ణ శోభితం.. కళాత్మకం



కళాత్మకంగా తీర్చిదిద్దుతున్న ప్రాంగణం



ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో సిద్ధమైన సిమెంట్ బెంచీలు

- తుది దశకు ఏయూ ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులు
- రూసా నిధులు, దాతల సాయంతో ఆధునికీకరణ

**ఏయూ క్యాంపస్:** కళలకు పట్టం కట్టిన వేదిక అది. అగ్ర సినీనటులు సైతం కూర్చుని నాటకాన్ని వీక్షించిన చారిత్రక ప్రాంగణమది. ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా మహామహులను నాటక, కళ, చిత్ర రంగాలకు అందించిన మహోన్నత ఘనత ఉంది. ఏయూలో దశాబ్దాల క్రితం నిర్మితమై నిత్యం సాంస్కృతిక, కళారంగ కార్యక్రమాలతో వెలుగులు ప్రసరింపజేసిన కె.వి.గోపాలస్వామి ఓపెన్ ఎయిర్ థియేటర్ సరికొత్తగా ముస్తాబవుతోంది. విశాఖ నగరాన్ని కళలకు వేదికగా, ఏయూకు పూర్వ వైభవాన్ని సంతరించే దిశగా సిద్ధమవుతోంది. ఇప్పటికే వేదిక, సీటింగ్ ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు భవనాన్ని మరింత కళాత్మకంగా తీర్చిదిద్ది తుదిమెరుగులు అద్దే ప్రక్రియ చేస్తున్నారు.

**ఆధునిక సొబగులు**

రూసా నిధులతో ప్రధాన వేదికను ఆధునీకరించిన అధికారులు, రెండో దశలో దాతల సహకారంతో సిమెంట్ కుర్చీలు ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న మాదిరిగానే వేదికను, సీటింగ్ ఏర్పాట్లను పూర్తిచేసి, వాటికి ఆధునిక సొబగులు అద్దారు. నాటకం ఒక రంగుల ప్రపంచం. సమాజానికి దర్పణంగా, మానవ సంబంధాలను ప్రతిబింబించేవిగా నాటకాలు నిలుస్తాయి. ఇటువంటి రంగుల కళను ప్రదర్శించే ప్రాంగణం కూడా ఎంతో కళాత్మకంగా ఉండాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆలోచన చేశారు. వెంటనే ఆచరణలో చూపుతూ కె.వి.గోపాలస్వామి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంను రంగులమయం చేస్తున్నారు.



రహదారిని ఆనుకుని ఉన్న గోడపై బొమ్మలు గీస్తున్న విద్యార్థులు

**విద్యార్థులే కళాకారులు**

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆర్కిటెక్చర్ విభాగం విద్యార్థుల సహకారం, ఆలోచనలతో రహదారిని ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని ఎంతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. దీనిలో భారతీయ, పాశ్చాత్య కళలు, సంస్కృతులు, నృత్య రీతులను ప్రతిబింబిస్తూ విద్యార్థులు చిత్రాలను తీర్చిదిద్దారు. బయట వారిని తీసుకోకుండా, కేవలం ఏయూ విద్యార్థులకు అవకాశం ఇస్తూ, వారి ఆలోచలను ప్రతిబింబిస్తూ ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. వేదిక వద్దకు వెళ్లే ప్రాంతంలో గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా చిత్రీకరించారు. సంక్రాంతికి వచ్చే హరిదాసులు, ఇంటి ముంగిట ముగ్గులేసే ఆడపడుచులు, పాడి పంటలతో సంవృద్ధిగా ఉండే రైతన్న, దీపావళి పండగ, భారతీయ సంప్రదాయ కుటుంబ వ్యవస్థల చిత్రాలతో సుందరంగా తీర్చిదిద్దారు.



తుది మెరుగులు దిద్దుకుని ముస్తాబవుతున్న ప్రధాన వేదిక

**ఆకర్షణీయంగా ప్రధాన వేదిక**

ప్రధాన వేదికకు వైవిధ్యమైన వర్ణాలు అద్ది ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ప్రాంగణం, వేదిక, భవన సౌందర్యాన్ని సైతం చూసి కళాభిమానులు అబ్బురపడేలా కళాత్మకంగా సిద్ధం చేస్తున్నారు. ప్రధాన వేదికకు ఎదురుగా, సిమెంట్ కుర్చీలకు వెనక భాగంలో రాజుల కాలాన్ని తలపించే మూడు స్థూపాలు వంటివి ఇక్కడ ఉన్నాయి. వీటిని రాతితో నిర్మించారా? అనే విధంగా రంగులు అద్దుతూ ముస్తాబు చేస్తున్నారు. ఈ ఆరుబయలు రంగస్థలంపై త్వరలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించడానికి ఏయూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

## ఏయూ సమాచారం..

### పరీక్ష కేంద్రాల పరిశీలన



పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో జరుగుతున్న పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మంగళవారం పరిశీలించారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పటిష్టంగా నిర్వహించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, తదితరులు పాల్గొన్నారు.

## కనకమ్మ భక్తులకు మజ్జిగ వితరణ



మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

**దాబాగార్డెన్స్:** చినవాల్తేరు గ్రామంలో వెలసిన కనకమహాలక్ష్మి (దుర్గ) వార్షిక జాతర మహోత్సవం సందర్భంగా పట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో, మళ్ల మాధవ్ కామాక్షి సౌజన్యంతో మంగళవారం పెద్ద ఎత్తున భక్తులకు మజ్జిగ వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జీవీ రామచంద్రరావు, పోతనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. ప్రతి ఏటా కనకమ్మ వార్షిక జాతర మహోత్సవాల్లో భక్తులకు సేవలందిస్తున్నట్లు పట్టా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టా రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు జి. దేవుడుబాబు, బొడ్డేద వెంకటలక్ష్మి, దొడ్డి రమేష్, పెంటకోట శ్రీలక్ష్మి, శ్రీదేవి, తాతనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సైన్స్ జర్నల్ చీఫ్ ఎడిటర్‌గా కృష్ణా కళాశాల అధ్యాపకుడు



రామారావుకు నియామక పత్రం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

**మద్దిలపాలెం:** డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రి రామారావుకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ జువాలజీ స్టడీస్‌కు చీఫ్ ఎడిటర్‌గా ఆయన నియామకమయ్యారు. ఈ మేరకు సైన్స్ పత్రిక నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయలు అధ్యాపకుడు కర్రి రామారావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రామారావు అనేక అంతర్జాతీయ ప్రచురణలు, పుస్తకాల రచనతో పాటు సైన్స్ పత్రికలకు సంపాదకుడిగా , పర్యవేక్షకుడిగా పని చేస్తున్నారన్నారు. రామారావు కళాశాల కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింపజేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు స్టాఫ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.సిహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజశేఖర్, రాజారావు పాల్గొన్నారు.

## పిల్లల్లో కంటి క్యాన్సర్‌పై అవగాహన అవసరం



టీ షర్టులు ఆవిష్కరిస్తున్న హాకీ చాంపియన్స్ కీర్తి, అజయ్‌కుమార్, ఎల్వీపీ కంటి ఆస్పత్రి వైద్యులు

**ఆరిలోవ:** పిల్లల్లో కంటి క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి హెడ్ డాక్టర్ భవిక్ ఉత్తమ్ తెలిపారు. హనుమంతవాక వద్ద ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో మంగళవారం పిల్లల్లో కంటి క్యాన్సర్‌పై తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జాతీయ రోలర్ హాకీ చాంపియన్లు గాదిరాజు కీర్తి, గాదిరాజు అజయ్‌కుమార్ వర్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భవిక్ మాట్లాడుతూ కంటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించడానికి ఈ నెల 28న ఆర్‌కే బీచ్‌లో కాళీ మాత ఆలయం వద్ద విటథాన్ రన్ నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు టీషర్ట్‌లు ఆవిష్కరించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.జె.శ్రీనివాస్, వైజాగ్ రన్నర్ సొసైటీ అధ్యక్షుడు బాలకృష్ణరాయ్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

## వైభవంగా అమ్మవార్ల మహోత్సవాలు



చినవాల్తేరులో కనకమహాలక్ష్మికి పూజలు చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ



భూలోకమాతను దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటరావు

**బీచ్ రోడ్డు:** తూర్పు నియోజకవర్గ పరిధిలో కొలువైన పలువురి అమ్మవార్ల పండగలు మంగళవారం వైభవంగా జరిగాయి. చినవాల్తేరులో ఉన్న కనకమహాలక్ష్మి జాతరను ఘనంగా నిర్వహించారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహ్మదీయ మసీద్ యూత్ సభ్యులు భక్తులకు పులిహోర, పానీయాలు పంపిణీ చెశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 21వ వార్డు అధ్యక్షుడు రవికుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**భూలోకమాతకు ప్రత్యేక పూజలు**

**మద్దిలపాలెం:** స్థానిక భూలోకమాత ఉత్సవాలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు అక్కరమాని వెంకటరావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండగ సందర్భంగా మద్దిలపాలెంలో విద్యుత్ దీపాలంకరణ చేశారు. సాయంత్రం సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. పార్టీ నాయకులు రమేష్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ఎంవీపీ కాలనీ సెక్టార్–6లో..**

**ఎంవీపీ కాలనీ:** స్థానిక సెక్టార్–6లోని గొల్లవీధిలో కొలువైన కనకమ్మ అమ్మవారి జాతర కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా గొల్లవీధిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అక్కరమాని వెంకటరావు దర్శించుకున్నారు. అమ్మవారి సారే ఊరేగింపులో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## నిద్ర సుఖమెరుగదు



నిద్ర సుఖమెరుగదు.. ఆకలి రుచెరుగదు అన్న సామెత నిజం అనడానికి ఈ చిత్రం ప్రత్యక్ష ఉదాహరణ. అలసిన శరీరానికి పట్టు పాన్పులు అవసరం లేదు. రహదారి పక్కన చెట్టు కింద నేల మీదైనా మంచి నిద్ర పట్టేస్తుంది. ఇలా ఏయూలోని వెంకటేశ్వర ప్రేయర్ హాల్ ఎదురుగా రోడ్డు పక్కనే వాహనాన్ని నిలిపి దానిపైనే గాఢనిద్రలోకి జారుకున్నాడో వ్యక్తి. బైక్‌ను పాన్పుగా భావించి హాయిగా కునుకుతీశాడు.

– ఏయూ క్యాంపస్

## ఎట్టకేలకు పూడిక తరలింపు



శివాజీపాలెం రోడ్డు పక్కన ఉన్న పూడికను తరలిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

**మద్దిలపాలెం:** శివాజీపాలెం ప్రధాన రహదారి పక్కన ఉన్న గెడ్డలో తీసి వదిలేసిన పూడికను ఎట్టకేలకు జీవీఎంసీ సిబ్బంది తరలించారు. సాక్షి దిన పత్రికలో మంగళవారం పూడిక తీసి వదిలేశారు! శీర్షికతో ప్రచురితమైన వార్తకు జీవీఎంసీ 22వ వార్డు పారిశుద్ధ్య విభాగం సిబ్బంది స్పందించారు. జేసీబీ, లారీ తీసుకువచ్చి హుటాహుటిన పూడికను తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. సమస్య పరిష్కారం కావడంతో సాక్షికి సమాచారం ఇచ్చిన శివాజీపాలెంకు చెందిన పి.వి.రమణమూర్తి థ్యాంక్యూ సాక్షి అంటూ కృతజ్ఞతలు తెలిపారు.

## పశు సంవర్ధక శాఖ కార్యాలయానికి కొత్త శోభ



నాడు



నేడు

తోటగరువులో ప్రాంతీయ పశు వైద్యశాల

**ఆరిలోవ:** పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో కొన్నాళ్లుగా నాడు–నేడు పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీంతో చినగదిలి మండలం తోటగరువులో ప్రాంతీయ పశు వైద్యశాల భవనం కొత్తశోభతో కళకళలాడుతోంది. నాడు–నేడు పనుల్లో భాగంగా ఈ ఆస్పత్రిని అభివృద్ధి చేశారు. ఆస్పత్రి భవనంలో లోపల, బయట మరమ్మతులు చేపట్టారు. బీటలు వారిన గోడలకు ప్లాస్టింగ్ చేసి, పెయింటింగ్ వేశారు. ఇక్కడికి వస్తున్న పాడి రైతులు, పెంపుడు కుక్కల యజమానులకు ఆస్పత్రి వాతావరణం ఆహ్లాదం కలిగిస్తోంది.

## మోదీ నిరంకుశ పాలనకు మూల్యం తప్పదు



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న క్యాబ్ యూనియన నాయకులు

**సీతమ్మధార :** మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని క్యాబ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు హెచ్చరించారు. మంగళవారం అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు 788వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రభుత్వంపై ప్రజలకు రోజురోజుకు అసహనం పెరిగిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు ఆపాలని లేని పక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మాలని చూస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయుడు, గోపీకృష్ణ, అప్పలరాజు, శివ, శ్రీనివాసులు, శ్రీను, ప్రసాద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యోగుల వినతి



ఎమ్మెల్యే ముత్తంశెట్టికి వినతి పత్రం అందిస్తున్న అమరావతి జేఏసీ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరెడ్డి

**మహారాణిపేట :** ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ పిలుపు మేరకు రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు, ఎంపీలను కలిసి «ఉద్యోగుల వేదనలను చెపుదాం»కార్యక్రమంలో భాగంగా మంగళవారం పలువురు ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందించారు. మంగళవారం భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావులకు తమ సమస్యల్ని నివేదిస్తూ, వినతి పత్రాలు సమర్పించినట్టు జేఏసీ జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు ఎస్ఏ త్రినాథ్‌రావు, కార్యదర్శి సీహెచ్ రమేష్, ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం అధ్యక్షుడు నమ్మి శ్రీనివాసరావు, కార్యదర్శి నాగయ్య, ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరావు, గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల జిల్లా సంఘ అధ్యక్షుడు సురేష్ కుమార్, రెవెన్యూ సంఘ నాయకులు పీయూఎస్ మహేష్, సుధాకర్, రవి శంకర్, ఆర్‌టీసీ, వీఆర్‌ఏ సంఘ నాయకులు, పెన్షనర్ల సంఘ నాయకులు పాల్గొన్నారు.

## కాలువలో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన రవికుమార్

**అల్లిపురం:** మద్యం మత్తులో ఆర్టీసీ కాంప్లెక్స్ దరి కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసు కుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం విశాలాక్షినగర్‌కు చెందిన నడిగట్టు రవికుమార్(43) సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసి రిటైర్ అయ్యాడు. తర్వాత మద్దిలపాలెంలో గల మహేంద్ర షో రూంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను తాగుడుకు అలవాటు పడ్డాడు. సోమవారం రాత్రి ఇంట్లో విజయనగరం వెళ్తున్నానని చెప్పి కాంప్లెక్స్ వచ్చాడు. మంగళవారం తెల్లవారి అతను కాలువలో పడి మృతి చెందిన విషయం గమనించిన ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని తండ్రి అప్పలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఆరిలోవ:** ఆరిలోవ ఫీడర్ పరిధిలో మరమ్మతు లు జరగనుండడంతో బుధవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ ఆరిలోవ ఎస్ఎస్ 11కేవీ ఫీడర్ పరిధిలో మెయింటినెన్స్ పనులు జరగనున్నాయి. దీంతో సంతపాలెం, తోటగరువు, బాలాజీనగర్, గాంధీనగర్, శ్రీహరినగర్, కైలాసనగర్, రవీంద్రనగర్ ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాలలో ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

## ఐసీఐసీఐలో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టుకు ఇంటర్వ్యూ నేడు

**గాజువాక:** ఐసీఐసీఐ బ్యాంక్‌లో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టును ఆన్‌రోల్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు ఈ నెల 24న స్థానిక చైతన్య మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. డిగ్రీ అభ్యర్థులు నేరుగా ఈ ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని కళాశాల ప్రిన్సిపాల్ చంద్ర మహాలక్ష్మి తెలిపారు. వివరాల కోసం 96766 03446 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## రుణం పేరిట టోకరా

**అల్లిపురం:** ఫైనాన్స్ కంపెనీలో పనిచేసే వ్యక్తి లోన్ ఇప్పిస్తానని చెప్పి కొంత మందిచే దరఖాస్తులు చేయించాడు. తర్వాత లోన్ రాలేదని చెప్పి లోన్ డబ్బును తన ఖాతాలో వేసుకుని మోసగించాడని బాధితులు మంగళవారం టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం డాబాగార్డెన్స్‌కు చెందిన సెల్ ఎలెక్ట్ షోరూంలో రక్షిత్ అనే ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ తమను మోసగించాడని వి.నరేష్, పత్తి గోవిందరావు తెలిపారు. పత్తి గోవిందరావుకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో రూ.50 వేలు, ఐసీఐసీఐ బ్యాంకులో రూ.50 వేలు, ఐడీఎఫ్‌సీలో రూ.50 వేలు లోన్ ఇప్పిస్తానని చెప్పి లాగిన్ చేశాడు. తర్వాత మీకు సిబిల్ స్కోర్‌లేదు లోన్ రాలేదని చెప్పాడు. కాని గత రెండు రోజులుగా బ్యాంకు నుంచి ఫోన్ చేసి లోన్ ఎమౌంట్ కట్టమని ఒత్తిడి చేస్తున్నారని పేర్కొన్నారు. సదరు షోరూంకు వెళ్లి అడగ్గా రక్షిత్ పరారయ్యాడని, అతనిపై చాలా కేసులున్నాయని చెప్పడంతో బాధితులు టూటౌన్ పోలీసులను ఆశ్రయించారు.

## కొత్తమ్మవారి ఘటాలు ప్రారంభం



అల్లిపురం వీధుల్లో తిరుగుతున్న అమ్మవారి ఘటాలు

**అల్లిపురం:** కొత్తమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం నుంచి గ్రామంలో అమ్మవారి ఘటాలు ప్రారంభమయ్యాయి. ఈ ఘటాలు అమ్మవారి ప్రధాన పండగ ముగిసే వరకు గ్రామంలో తిరుగుతాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. సాంప్రదాయ డప్పు వాయిద్యాల నడుమ అమ్మవారి ఘటాలతో మహిళలు వీధివీధి తిరిగుతారని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, నీలాపు రమణారెడ్డి, అయ్యప్పరెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.